కిడ్నీ ఖరీదు

సోమిరెడ్డి జమున

అప్పుడే రౌండ్స్ ముగించుకుని క్యుబన్‌వెస్ట్ వార్డ్ నుండి కిడ్నీ డిపార్ట్‌మెంట్‌లో పేరు పొందిన డాక్టర్ శర్మ తన ఫ్రెండ్ దయానంద్ కోసం కార్డియాలజీ డిపార్ట్‌మెంటుకు రింగ్ చేసాడు.

''డాక్టర్ దయానంద్ హియర్.''

''నేను శర్మని కాంటీన్ కెళ్దాం వస్తావా?''

''వద్దు? ఐదునిముషాల్లో మీ డిపార్ట్‌మెంటుకు వస్తాను పనుంది.''

''నేను మా ఆఫీస్ రూమ్‌లో కూర్చుని వుంటాను వచ్చెయ్.''

ఫోన్ డిస్‌కనెక్ట్ చేసి పోస్ట్ అందుకుని విప్పి పూర్తిగా చదివిన డాక్టర్ శర్మ ముఖం తెల్లగా పాలిపోయింది. హఠాత్తుగా ఆవహించిన నీరసంతో వెనక్కు వాలి కళ్లు మూసుకున్నాడు.

ఎన్ని నిమిషాలు అలా నిశ్శబ్దంగా గడచి పోయాయోగానీ దయానంద్ రాకతో మెల్లిగా కళ్లు విప్పాడు. అతని నుదురంతా స్వేద బిందువులతో నిండిపోయింది. కూర్చో అన్నట్లు కుర్చీ చూపించి మరలా కళ్లు మూసుకున్నాడు. అతని లోని మానసిక వ్యధ అతని ముఖంలో ప్రతిబింబిస్తోంది. ఎద పైకి, క్రిందకు ఎగసిపడ్తోంది.

''ఏమయింది శర్మా ? వాట్ హాపెండ్ ?''

''యమున చనిపోయింది దయా.''

''ఏ యమున ? ''

''నీకు నెల క్రితమే యమునను చూపించాను గుర్తులేదా ?''

డాక్టర్ దయానంద్ గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

క్షణంలో క్షణంసేపు గుండె నిండిన కన్నీళ్లతో గతంలోకెళ్లిపోయాడు డాక్టర్ శర్మ.

ఆరు సంవత్సరాల క్రితం ఓ. పి. లో కూర్చుని అప్పుడే వచ్చివెళ్లిన పేషెంటు తాలూకు వివరాలు కేస్ షీట్‌లో వ్రాసుకుంటున్న తను...

''నమస్తే డాక్టరుగారూ!'' అన్న కంఠం వినపడి తలెత్తాడు. తన ఎదురుగా పద్దెనిమిది సంవత్సరాల అమ్మాయి నిలబడి వుంది. ఆ అమ్మాయిని చూడగానే తనలో చలనం. ఏవో సంవత్సరాల క్రితం జ్ఞాపకాలు. డేట్ క్లియర్ చేసుకునేదానికి కేస్ షీట్‌లో పేరు చూసాడు.

'యమున' అనుమానం తీరింది.

''అప్పుడప్పుడు ముఖం వాస్తుంది డాక్టరుగారూ!'' అందామ్మాయి.

''డాక్టరుగారు కాదమ్మా శర్మన్నయని ఇంకా గుర్తుపట్టలా?'' ఆనందంగా అన్నాడు తను. తన గుండెల్లో చిన్నారి యమున నిత్య నూతనంగా మిగిలిపోయింది.

''మీరూ'' ఆలోచిస్తూ ఆగిపోయింది.

తలమీద ఓ మొట్టికాయ వేసి ''భలే దానివేనమ్మా. ఎనిమిదేళ్ళవరకు నా భుజంమీద పెరిగావు. నా స్టడీస్‌కోసం చిత్తూరు వదిలి వెళ్ళాల్సివచ్చినపుడు నిన్నొదిలి వెళ్ళాలని ఏడ్చాను కూడా.''

''మీరు శర్మన్నయ్యా?'' గుర్తు చేసుకుంటున్నట్టుగా మెల్లగా అంది.

''గుర్తొచ్చానా? పెద్దదానివయిపోయావు. నిన్ను నేను గుర్తు పట్టడం కష్టం. కానీ నన్ను గుర్తు పట్టడానికి ఇంతాలస్యం చేశావేం యమునా?''

''పదేళ్ళయిపోయిందిగా'' అని సిగ్గుపడి ''అయినా అమ్మ ఎప్పుడూ మిమ్మల్ని మీ అమ్మగార్ని తల్చుకుంటూనే వుంటుంది. ఎప్పుడు నేను మారాం చేసినా మీరొచ్చి కబుర్లతో, కథలతో నన్ను ఆడించేవాళ్ళని గుర్తుచేస్తూ వుంటుంది.''

''నిజమేనమ్మా! ఒక్కోరోజు స్కూల్ కెళ్ళనని ఎంత మారాం చేసేదానివో అలాటప్పుడు మీ అమ్మ నిన్ను నా దగ్గర వదిలేసి వెళ్ళిపోయేవారు, ఓ ఐస్‌ఫ్రూట్ లంచం ఇచ్చి సైకిల్‌మీద తీసుకెళ్ళి వదిలేవాడిని.''

''అమ్మ, వెంకట్ రెడ్డి కులాసానా యమునా?''

''ఊఁ'' ఆశ్చర్యంగా చూస్తోంది.

''వెంకట్‌కు పెళ్ళయిందా?''

''ఆ''

''ఇప్పుడేం చదువుతున్నావ్?''

''బి. ఎ. సెకండ్ ఇయర్.''

''ఏం గ్రూపు తీసుకున్నావ్?''

''హిస్టరీ, ఎకనమిక్స్, అడ్వాన్స్‌డ్ తెలుగు''

''అమ్మో! ఇక తెలుగు నీతో మాట్లాడలేనన్నమాట.''

''నాకు అ, ఆ లు దిద్దించింది కూడా మీరేకదా!''

''నో... నీవు నన్ను 'మీరు' అని గానీ 'డాక్టర్' అని గానీ పిలవొద్దు యమునా. నాకీ ప్రపంచంలో వుండే ఒకే ఒక ఆత్మీయురాలు 'అమ్మ'కూడా చనిపోయింది. చిన్నప్పుడు నన్నెలా 'శర్మన్నయ్యా' అనేదానివో అలాగే పిలువమ్మా. నాకు నిన్ను చూస్తుంటే చాలా సంతోషంగా వుంది. ఇప్పుడు మీరు చిత్తూరులోనేవున్నారా?''

''ఆ''

''నాకిక్కడ పోస్టింగ్ రాగానే మీ కోసం చిత్తూరులో అప్పుడు మనమున్న దగ్గర వాకబు చేస్తే అక్కడ మీరు లేరు.''

''గిరింపేటలో వెంకటన్నయ్య ఇల్లు కట్టి ఐదు సంవత్సరాలయింది.''

''ఇన్ని రోజులు చిత్తూరులో వుండి రాలేక పోయావా?''

''మా శర్మన్నయ్య ఇక్కడున్నాడని తెలిస్తే ఎప్పుడో వచ్చేదాన్ని'' నవ్వుతూ అంది.

''వెంకట్ చదువాపేశాడా?''

''చదువుమీద ఇంటరెస్ట్ లేదు.''

''ఏం బిజినెస్ చేస్తున్నాడు.''

''రకరకాలు'' అని నవ్వేసింది మరలా.

''అమ్మ ఆరోగ్యం బాగుందా?''

''అమ్మకు నా గురించే బెంగ.''

''ఎందుకూ?''

''హెల్త్ బాగలేదు కదా నాకు.''

''ఏమిటో నిన్ను గుర్తుపట్టిన ఆనందంలో నీ విషయమే మర్చిపోయాను. ఇప్పుడు చెప్పు ఎలా వుంటుందమ్మా నీకు?''

''అప్పుడప్పుడు ముఖం, కాళ్ళు వాస్తాయి. చాలా నీరసంగా వుంటుంది.''

''ఎప్పటినుండి?''

''రెండు సంవత్సరాలనుండి.''

''అప్పటినుండి ఎవరికీ చూపించుకోలేదా?''

లేదన్నట్టు తలూపింది.

ఆ తర్వాత తను డాక్టర్‌గా మారిపోయి చకచక బి. పి. కట్టాడు. అన్ని ఇన్‌వెస్టిగేషన్స్‌కు వ్రాసి 'నీకు డిస్ట్రబెన్స్, నేనెళ్ళి టెస్ట్‌లన్నీ ఇచ్చేస్తాను' అని యమున చెప్పినా వినకుండా దగ్గరుండి టెస్ట్‌లన్నీ ఇప్పించాడు. యమునతో కాంటీన్ కెళ్ళి కబుర్లు చెప్పుకుంటూ కొద్దిసేపు గడిపి ఆమెను మరలా రెండు రోజుల తర్వాత రమ్మని చెప్పి ఓ.పిలో తలదూర్చాడు.

యమునని చూసాననే ఆనందం యమున ఇన్‌వెస్టిగేషన్స్ రిపోర్ట్ చూడగానే చప్పున చల్లారిపోయింది. యమునకు కిడ్నీ ట్రబుల్ అని తేలింది.

అలా మొదలయిన ఆమె ట్రీట్‌మెంటు ఐదు సంవత్సరాలు ప్రతి మూడు నెలలకు చెక్ అప్‌తో జరిగి లాస్ట్‌లో మూడు సంవత్సరాల క్రితం కంప్లీట్‌గా రెండు కిడ్నీలు డామేజ్ అవడంతో ఆపరేషన్ చేయాల్సి వచ్చింది.

''ఓ... మీ సిస్టర్ అని చెప్తివే ఆమేనా?.. ఆపరేషన్ సక్సెస్ అయిందని చెప్పావుగా?''

అప్పటి వరకు నిశ్శబ్దంగా వున్న శర్మ డాక్టర్ దయానంద్ ప్రశ్నతో యమున గత కాలపు జ్ఞాపకాలనుండి బయటపడి ''అవును'' అన్నాడు.

''ఇప్పుడు ఫెయిల్యూర్‌లో కెళ్ళిందా?''

తల అడ్డంగా తిప్పాడు డాక్టర్ శర్మ. అతని నోటి వెంట మాటరావడంలేదు. ఇన్ని సంవత్సరాలు చెల్లెలుగా, ఆత్మీయతను పంచి ఇచ్చిన యమున ఇక లేదు అనుకోగానే అతని కనుకొనుకులనుండి కన్నీటిబొట్లు జారి టేబిల్ మీద పడ్డా అతను తుడుచుకోలేదు.

డాక్టర్ దయానంద్ అచేతనుడయ్యాడు. ఎప్పుడూ జోక్స్‌వేస్తూ ఒకర్ని సంతోషపెట్టే శర్మ గుండెల్లో ఇంత సున్నితమైన పొరలా? యమునకొరకు శర్మ ఇంతగా చలించిపోతున్నాడా?

వాళ్ళిద్దరి అపురూపమైన అనుబంధాన్ని ఊహిస్తున్నాడు డాక్టర్ దయానంద్.

''ఒకరోజు యమున నడవలేని స్థితిలో నొళ్ళంతా వాపులతో, వాళ్ళమ్మ పట్టుకుని నడిపించుకురాగా మెల్లిగా వచ్చి నా ఎదురుగా కూర్చుంది. ఎప్పటికప్పుడు యమున ఆరోగ్య పరిస్థితి తెల్సిన నేను వార్డ్‌లో అడ్మిట్‌చేసి టెస్ట్‌లన్నిటికి ఇచ్చాను.''

''ఉప్పులేని ఆహారం, వాపులు తగ్గడానికిచ్చే లాసిక్స్ ఇంజక్షన్లతో - ఆపరేషన్ అంటే భయంతో, బెంగతో పదిరోజులకే యమున బెడ్‌మీదనుండి కదల్లేని స్థితికి వచ్చింది. నేనెళ్ళి ధైర్యం చెప్పేవాణ్ణి. డయాలసిస్ స్టార్ట్ అయింది. వాళ్ళ మదర్ బ్లడ్ గ్రూప్ యమున బ్లడ్ గ్రూప్‌తో కలిసింది. యమున మదర్‌ని కిడ్నీడోనార్‌గా తీసుకుని ఆమెకన్ని టెస్ట్‌లు చేయడం జరిగింది. ఇంతలో వాళ్ళన్న వెంకట్‌రెడ్డి యమునకు తన కిడ్నీ తీసుకోమంటూ వచ్చాడు. అతని బ్లడ్ గ్రూప్, టిష్యూ మ్యాచింగ్ కూడా యమున బ్లడ్‌తో మ్యాచ్ అవడంతో - యమున తల్లి వయసు మించిపోయిందని, బి.పి. వుందని ఆమె చార్ట్ అక్కడ వదేసి వెంకట్‌కు అన్ని టెస్ట్‌లు చేయించాను.''

''వాళ్ళ అన్నయ్య కిడ్నీ చెల్లెలుకు ఇచ్చాడని చెప్పావుగా?''

''అదే... అదే నేను చేసిన పొరపాటని పిస్తోంది దయా?'' చాలా విచారంగా అన్నాడు.

''అదేం యంగ్‌మాన్, బి.పి. లేదు, బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అయింది. అతని కిడ్నీ మంచిది కదా!''

''ఒక విధంగా నేనే యమునను చంపేసాను.''

డాక్టర్ శర్మకు యమున ఇకలేదు అనుకుంటే భరించలేకపోతున్నాడు. అతని కళ్ళల్లో ఎర్ర జీరలు.

''బి. ప్రేవ్ శర్మ అసలేమయింది ?''

''అదే వాళ్ళమ్మ కిడ్నీ అయితే యమున చనిపోయేది కాదు.''

''అర్థం కానట్టు ముఖం పెట్టాడు డాక్టర్ దయానంద్.

''వెంకట్ అన్నయ్య చిన్నవాడు. నేనెలాగూ లాస్ట్ స్టేజిలో వున్నాను. నేను చనిపోతే ఈ బాధలనుండి విముక్తి పొందుతాను. అన్నయ్య కేమయినా అయితే నేను భరించలేను. అమ్మ కూడా అన్నయ్య కిడ్నీ వద్దంటోంది'' అంది యమున.

కానీ నేనే ... నేనే వెంకట్‌కేమీ అవదని, మనిషికి ఒక్క కిడ్నీ చాలని ధైర్యం చెప్పాను. ఇంతలో వెంకట్ వచ్చి—

''నా బ్లడ్ గ్రూప్ యమునకు మ్యాచ్ అవకుండా వుండి వుంటే నా బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అయ్యేవాళ్ళకయినా యిస్తాను గానీ ఎవ్వరికీ ఇవ్వకుండా వుండను'' అని ఘంటా పదంగా చెప్తే ఆ రోజు ఎంతో సంతోషపడ్డాను. యమునకు అంత మంచి అన్నయ్య వున్నందుకు గర్వించాను కూడా ... '' అతని కంఠం బొంగురుపోయింది.

''మరి ఇప్పుడామ్మాయి ఏ ట్రబుల్‌తో చనిపోయింది'' డాక్టర్ దయానంద్‌కు యమున ఎందుకు చనిపోయిందో తెలుసుకోవాలని తొందరగా వుంది.

మరలా డాక్టర్ శర్మ చెప్పసాగాడు.

ఒక్క నెల క్రితం యమున వచ్చింది. అలవాటుగా నేను ఇన్‌వెస్టిగేషన్స్ పేపరు తీసుకున్నాను.

''నేను టెస్ట్‌లు చేయించుకోవడానికి రాలేదన్నయ్యా !'' అంది.

''పదయితే ఇంటికెళ్దాం'' అని లేచిన నన్ను —

''ఊహుఁ ఇక్కడే కూర్చుందామం''టూ కూర్చుంది.

కిడ్నీ ఖరీదు

''అలా వున్నావేమ్మా బి. పి. కట్టి చూస్తాను ఇలారా'' అన్నాను.

''నాకు బ్రతకాలని లేదన్నయ్యా.'' ఏ ఉపోద్ఘాతం లేకుండా అంది.

''సరేలేఁ మీ అన్న, నేను నీ కొరకు యింత కష్టపడింది నీకు బ్రతకాలని లేకపోవడానికా ?'' అని కసిరి అసలు సంగతి చెప్పమన్నాను. నాతో సాయంత్రం దాకా గడిపింది కానీ ఏ సంగతి చెప్పకుండానే వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఈ లెటర్ అని తన చేతిలో నలిగిపోతున్న జాబు తన స్నేహితుడి కందించాడు. ఆతృతగా విప్పి చదవసాగాడు దయానంద్.

శర్మన్నయ్యా !

జీవితంలో అభిమానాల్ని డబ్బుతో కొలుస్తారనే సత్యాన్ని జీర్ణించుకోలేక యీ లోకాన్ని విడిచిపోతున్నాను. నాకు నచ్చిన వ్యక్తి ఎదురుగా నిలబడి చేయందిస్తుంటే, నీ బాధ్యత అన్నీ ఇక నావి అని ప్రేమగా చెప్తుంటే ఆ వ్యక్తి చెయ్యి పట్టుకుని అతని జీవితంలో భాగస్వామిని కావల్సిన నేను ఇలా నిర్జీవంగా మారిపోవడానికి కారణం నాకు నువ్వమర్చిన కిడ్నీయే అన్నయ్యా. ఇది పిరికితనమే కావచ్చు. కానీ నా అన్న నాకు కిడ్నీ ఇచ్చి నన్ను బ్రతికించుకున్నాడు అనుకున్నపుడు ఆ ఆనందాన్ననుభవించిన నా గుండె— ఇప్పుడు యీ సత్యాన్ని తెలుసుకుని ఇక నేను పని చేయలేను— అలసిపోయాను అంటోంది. ఆ సత్యమేమిటో చెప్పనా!

శేషారెడ్డి అనే అతను నాకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ అయిందని తెలిసీ, ఇక నాకు పిల్లలు పుట్టే అవకాశం లేదని తెలిసీ కూడా పెళ్ళి చేసుకుంటానన్నాడు—నాకూ అందరి ఆడపిల్లల్లానే సంపూర్ణంగా జీవించాలనుంది. ఓ మనిషి తోడుతో, అతని నీడలో అతని ప్రేమలో మునిగి బ్రతకాలనుంది— ఆఖరి దశలో ఒంటరిగా మిగిలిపోవాలని లేదు. నాకు తెలుసు ఎంత ప్రేమవున్నా అన్న, అన్నే భర్త భర్తే ! అందుకే... అందుకే ఖచ్చితంగా శేషుని పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకుని, నా ప్రాణాన్ని నిలిపిన వెంకటన్నకు ఆ వార్తను ఆనందంగా మోసుకెళ్ళాను.

''నీకు పెళ్ళొద్దమ్మా ఎవరు చేసుకున్నా నీ డబ్బు కొరకే చేసుకుంటారు వద్దు తల్లీ!'' సౌమ్యంగా అన్నాడు.

''ఆయన అలాటి వాడు కాదన్నయ్యా'' అన్నాను.

''ఆఁ అందరూ అలాగే కన్పిస్తారమ్మా. అతను నాకు తెలియకపోవడమేమిటి ? పుత్తి తేనె పూసిన కత్తి— మాటలు మాత్రం తీయగా వుంటాయి.''

''ఊహుఁ అతనలాటివాడు కాదు. నీ కంటె నాకు బాగా తెలుసు.''

''చెప్తే అర్థం చేసుకోమ్మా. రేప్రొద్దున నీకు తిండి కూడా పెట్టడు. ఉత్త పిసినారి. పైగా స్వార్థపరుడు.''

''అతను పిసినారే కావచ్చు, స్వార్థపరుడే కావచ్చు కానీ అతను నాకు మూడేళ్ళుగా తెలుసు. ఆ స్వార్థంలో భార్య కూడా వుంటుంది. అతను పిసినారే కావచ్చు ఎంతవరకు పిసినారో నాకు తెలుసు. అతని డబ్బు ఒకరికివ్వడు. అతను ఒకరి డబ్బు ఆశించడు. వున్నంతలో గుంభనంగా జరుపుకుంటాడు'' తల వంచుకునే ధైర్యం చేసి అన్నాను.

''ఓ చాలా తెలుసుకున్నావన్నమాట. అతనికి చిల్లికానీ ఆస్తి లేదు. అది మాత్రం తెలిసినట్టు లేదు. అమ్మే బ్రతికుంటే యీ పెళ్ళికి ఒప్పుకునేది కాదు.''

''అన్నయ్యా ! ఏమీ తెలుసుకోకుండా నేను పెళ్ళి చేసుకుంటే — నా పరిస్థితి నాకు తెలుసుగా. నేను కిడ్నీ పేషెంటుని. ఎప్పుడు మరలా నా కిడ్నీ ఫెయిలవుతుందో నాకు తెలీదు. ఫెయిల్ అయిన రోజు నన్ను అపురూపంగా చూసుకుని నాకు బ్రతుకుమీద విరక్తి రాకుండానే నన్ను సాగనంపే మనిషి కావాలి. డబ్బు కాదు నాక్కావాల్సింది. అయినా ఆయనకున్న పదెకరాలతో ఆయన జీవితాన్ని సుఖమయం చేసుకోగల సమర్థత వుంది. ఆ ఆస్థి మీద ఆధారపడాల్సిన అవసరం లేదు.''

''శర్మన్నయ్యా ! నేను కాస్త తీవ్రంగానే మాట్లాడినట్టున్నాను. ఆ స్వతంత్రం మా అన్న దగ్గర నాకుందనుకున్నాను. పైగా ఆయన్ను 'చిల్లికానీ లేదని' ఎద్దేవా చేస్తుంటే సహించలేకపోయాను. శేషు మీద, శేషు ప్రవర్తన మీద నేనప్పటికే అభిమానాన్ని పెంచుకున్నాను.

''అయితే ఓ పని చేయమ్మా. నీ పేర అమ్మ వ్రాసిన ఆస్థిని నా పేర వ్రాసేసి వెళ్ళు, అప్పుడు అతను నిన్ను చేసుకుంటాడేమో చూద్దాం.''



చాలా సౌమ్యంగా అన్నాడు వెంకటన్నయ్య. అప్పటికి అతనిలో కుట్ర నేను గ్రహించలేదు. అవివేకంతో నాకేదో మంచి చేయాలని అంటున్నాడనే అనుకున్నాను.

అన్నయ్య చెప్పిన పాయింట్ మీద క్షణం ఆలోచించాను.

నీ ఆస్తి వదిలేసి వచ్చినా నేను నిన్ను పోషించుకోగలనన్నాడు శేషు — అతని పేరు శేషారెడ్డి. కానీ నాకేదయినా అయితే నా ట్రీట్‌మెంటుకు లక్షరూపాయలు ఖర్చుపెట్టి అతన్ని బికారిగా మిగిల్చి నేవెళ్ళిపోవడం నేనూహించలేకపోయాను. అందుకే అన్నాను —

''నేను జబ్బు మనిషిని కదన్నయ్యా ఒక వేళ నువ్వు ప్రేమతో ఇచ్చిన కిడ్నీ ఫెయిలయిందనుకో. దానికొరకు ఖర్చు పెట్టుకోవడానికి మాత్రం నాకీ ఆస్తి కావాలన్నయ్యా.''

''భార్యకు జబ్బుచేస్తే నయం చేసుకోలేని దౌర్భాగ్యుడికి నా చెల్లెల్నివ్వను.'' ఖచ్చితంగా అనేసి నా జవాబు వినకుండానే వెళ్ళిపోయాడన్నయ్య.

నేను ఏమి నిర్ణయించుకోవాలో తెలీనిదానిలా ఓ నిముషంపాటు మాత్రమే ఆగాను. ఆ తర్వాత ఖచ్చితంగా శేషుని పెళ్ళి చేసుకోవడానికే నిర్ణయించుకున్నాను

శర్మన్నయ్యా! ఆ తర్వాత నా హృదయం

కిడ్నీ ఖరీదు

పగిలి, మనసు మొద్దుబారిపోయే మాటలు విని కూడా తట్టుకున్నానంటే అది నీ చెయ్యి చలవే.

ఆ రోజు మనసు బాగలేక అన్నకూతురు మమతతో కారమ్స్ ఆడుకుందామని వాళ్ళ రూమ్‌లో అడుగు బెట్టబోయిన నేను వాకిట్లో గాజుపెంకు గుచ్చుకుని అది తీసుకోవడంతో ఆగాను. రూమ్‌లోనుండి మాటలు వినవచ్చాయి. నా ప్రమేయం లేకుండానే నా చెవులు ఆ మాటలు విన్నాయి.

''ఆ అమ్మాయి అడిగినట్లు చేసేస్తే పోలేదండి. జబ్బుపిల్లను ఎన్నాళ్ళు భరిస్తాం'' వదిన కంఠం.

''చాల్లే నోరు మూసుకో. తెలివి. జబ్బు పిల్లను నేనెక్కడ అన్యాయం చేస్తానన్నట్లో అమ్మ ఆస్తంతా మా ఇద్దరిపేర చెరిసగం వ్రాసిందిగా. ఐదు లక్షల ఆస్తి ఆ పిల్ల మీదుంది. ఆ పిల్ల అనుభవించినన్ని రోజులు అనుభవిస్తుంది. ఆ తర్వాత మన పిల్లలను భవిస్తారు.''

''అయితే యమునకు పెళ్ళి చేయరా ?'' వదిన కంఠంలో ఆశ్చర్యం. అన్నయ్య ఎంత తెలివయినవాడో వదినకుకూడా అర్థంకాలేదు.

''మహా బ్రతికితే యమున పదేళ్ళు బ్రతుకుతుంది. పిల్లలు పుడితే ప్రమాదమని యమునకు అబద్ధం చెప్పాము. శేషారెడ్డి భార్య ప్రాణం పోతుందని తెలిస్తే పిల్లలు వద్దనుకుంటాడు. యమున పిల్లలూ అనుభవించక నా పిల్లలు అనుభవించక ఆ ఆస్తి వాడికెందుకు మిగలాలి?''

వదిన కాస్సేపు మాట్లాడలేదు.

''నాకామాత్రం ఆలోచనే లేదండీ.'' అని మాత్రం అని వూర్కుంది. తర్వాత వాళ్ళేమీ మాట్లాడకోలేదు. నా మనసులో సోదరప్రేమ మీద అపనమ్మకాన్ని కలిగించి నా గుండెల్లో ప్రేమను చంపేసి వాళ్ళు మాత్రం ఆ రాత్రి హాయిగా సినిమాకెళ్ళారు.

శర్మన్నయ్యా! నువ్వు నమ్మవు వారం రోజులు చిత్రహింస అనుభవించాను. రోజులు గడిచాక అన్నమీద విపరీతమైన విరక్తి... అంతే నా ప్రాపర్టీ కాగితాలు, నా తాలూకు సర్వం తీసుకుని శేషు ఇంటికి వచ్చేసాను. శేషు అమ్మ నన్ను సాదరంగానే ఆహ్వానించింది.

''ఆ డబ్బు అతని మొహానే కొట్టిరాక పోయావా అమ్మా'' అని మాత్రం అంది.

ఆ మాట ఆమె మనస్ఫూర్తిగా అన్నదో లేదో! అనే శంక నాలో మాత్రం కలిగిందనే నిజాన్ని నీ ముందు ఒప్పుకుంటున్నాను. మనుష్యులను నమ్మే అపురూపమైన దశమండి నా ప్రియమైన అన్నయ్య నన్ను దిగజార్చాడు.

వివాహ సంబంధములు

వివాహ సంబంధముల గురించి మీ కాలాన్ని, ధనాన్ని వృధా చేయనవసరం లేదు. అన్ని కులములవారికి, అన్ని వయసుల వారికి మావద్ద తగిన సంబంధములు వున్నవి.

బ్రాహ్మణులు, వైశ్యులు, క్షత్రియులు, కమ్మ, రెడ్డి, కాపు మొదలగు అన్ని కులములవారికి మా వద్ద ఏజంట్సు పని చేయుచున్నారు.

వివాహము కాని వయస్సు మళ్ళిన స్త్రీ, పురుషులు మరియు వయస్సులో విడాకులు తీసుకున్న మరియు భార్య భర్త విహీనులు మరల వివాహము చేసుకొనుటకు మాతో సంప్రదించండి. ఉత్తర ప్రత్యుత్తరాలు రహస్యముగా ఉంచబడును.

మా వద్ద రిజిష్టరు అయిన వాటికి సంబంధములు త్వరలో కుదర్చగలమని తెల్పుటకు సంతసించుచున్నాము. మీ పూర్తి వివరాలతోపాటు స్వయంగా కాని, స్వంత అడ్రసు కల స్టాంపు కవరుతోకాని సంప్రదించండి.

భారతీయ వివాహ కేంద్రం,
26-4 5, జ్ఞానోలివ్ వీధి, గాంధీనగరం,
విజయవాడ - 3.

శ్రీమహాలక్ష్మి వారి వెరైటీ నవలలు!
ఆగష్టు 25 విడుదల!

కొత్త శత్రువు (మెడికల్ నావెల్)
మల్లాది వెంకటకృష్ణమూర్తి .... రూ 15/-
సిగ్గు-సిగ్గు (సైంటిఫిక్ నవల) ఆంధ్రభూమి సీరియల్
ఎస్.ఆర్. నంది .... రూ25/-
ఆటవికం (అడ్వెంచరస్ నవల) డైరెక్ట్ నవల
వసుంధర .... రూ 15/-
సువర్ణరేఖ (ప్రేమనవల) ఆంధ్రజ్యోతి సీరియల్
భమిడిపాటి రామగోపాలం .... రూ.12-50
సాగరలోయ (అడ్వెంచరస్ నవల) అపరాధపరిశోధన సీరియల్
బొమ్మిడి అచ్చారావు .... రూ17/-
అడ్వాన్స్‌తోపాటు ఆర్డర్లు పంపించండి!

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
గవర్నరుపేట, విజయవాడ-520 002 ఫోన్ 63322

ఆవేశంలో ఆ ఇంటినుండి ఈ ఇంటికి వచ్చేసానే కానీ— నాలో కొండంత అశాంతి. అన్న చేతులమీదుగా ఘనంగా పెళ్ళిచేసుకోవాలనే కోరిక తీరలేదు. దొంగచాటుగా చేసుకోవాల్సి వస్తోంది — ఆ రోజు వున్న అందమైన కలలు యీ రోజు లేవు — శేషుతో పెళ్ళి, అతనితో జీవితం — ఆ బంగారు కల నా గుండెల్లో తీపి అన్నయ్య మోసం క్రింద నలిగిపోయింది. నాలో చనిపోవాలన్నంత విరక్తి — దాన్ని కంట్రోల్ చేసుకుంటున్న సమయంలో — మా అన్నయ్య వదిన ఆ ఇంటిమీదకు దండెత్తారు.

''నువ్వు అతన్ని చేసుకోవడానికి నిర్ణయించుకున్న పక్షంలో నా కిడ్నీ ఖరీదు నాకిచ్చేసి చేసుకో. లేదంటే నా కిడ్నీ నా కిచ్చేసెయ్.''

శర్మన్నయ్యా! నా సర్వేంద్రియాలూ ముద్దకట్టుకుపోయాయి — నేనేం వింటున్నానో నా కర్థంకాలేదు. మెదడు మొద్దుబారిపోయింది.

''నా కిడ్నీ నీ కివ్వకుండా సి.యం.సి. హాస్పిటల్‌లో అమ్ముకుంటే నాకు లక్ష రూపాయిలిచ్చేవాళ్ళు'' అన్నాడు.

నాలో హఠాత్తుగా విపరీతమైన మార్పు. ఇలాటి మనుష్యులున్న లోకంమీద జుగుప్స. ఆ లోకంలో బ్రతక్కూడదనే కసి — నిలువెల్లా అసహ్యం.

''చెప్పు లక్షరూపాయిలిస్తావా? నా కిడ్నీ నాకు తిరిగిస్తావా?''

అతను నిలదీస్తున్నాడు. నా మొద్దుబారిపోయిన మనసులో ఇంకా మిగిలిన స్పందన.

అంటే ... అంటే నా అన్నయ్య నా కిడ్నీ అడుగుతున్నాడంటే -- నా ప్రాణాన్ని అడుగుతున్నాడు.

''పద నీకివ్వాల్సింది నీ కిస్తాను'' అన్నాను అతన్ని. 'అన్నయ్యా' అని పిలవడానిక్కూడా నా కసహ్యంగా వుంది.

''ఏమిస్తావు?''

''అది నీకనవసరం పద.''

అతను కదల్లేదు.

''మీరు పదండి అరగంటలో నేను వస్తాను.''

''తప్పకుండా వస్తావా? మోసం చేస్తావా?''

''మోసం చేయడం నాకసహ్యం'' అన్నాను.

వాళ్ళు కదిలి వెళ్ళారు — నేను శేషుని వదిలేసివస్తే చాలనుకున్నారేమో! తర్వాత నన్ను బంధించొచ్చనుకున్నారేమో !

''నేను సాయంత్రం వచ్చి తీసుకెళ్తాను. నువ్వు కష్టపడడం నాకిష్టంలేదు.''

చురుగ్గా చూసాను.

''నీకా శ్రమ ఇవ్వను'' అన్నాను.

వాళ్ళు వెళ్ళిపోయారు. ఆ సమయంలో పనమ్మాయి తప్ప శేషు, అత్తయ్య ఇంట్లోలేరు.

నేను పిచ్చిదానిలా నా ఆస్తి పత్రాలు తీసుకున్నాను. నేరుగా కోర్టుకెళ్ళాను—వీలునామా వ్రాయించాను. నా తదనంతరం నా ఆస్తి శేషుకి—అతను అంగీకరించకపోతే కిడ్నీ పేషెంట్ల ట్రీట్‌మెంటు నిమిత్తం ట్రస్ట్‌కు వ్రాసాను — అరగంట అనుకున్నది కోర్టులో చాలా టైమే తీసుకుంది. తర్వాత శేషుకో ఉత్తరం నీకో ఉత్తరం వ్రాస్తున్నాను. ఉత్తరాలు పోస్ట్‌లోవేసి నా చావుకు కారణం ఎవ్వరూ కాదని వ్రాయాలి. చనిపోయేముందు మా వెంకటన్నయ్య మీద కాస్తంత ప్రేమ మిగిలిపోయింది చూసావాన్నయ్యా —

దోవలో ఎండ్రిన్ కొనుక్కుంటాను. ఇంటికెళ్ళి తాగేస్తాను.

ఎప్పుడో చిన్నప్పుడు నీ గుండెలమీద నే నాడాను. ఆ భాగ్యానికి నువ్వు నాకు చాలానే చేసావు. రక్తం పంచుకుని పుట్టిన అన్నయ్య నా చావుని చూస్తున్నాడు. ఎంత చిత్రం—

నా కమర్చిన నా అన్నయ్య కిడ్నీ నిండా విషం వుంది అని తెలిసిన మరుక్షణం నీ కింకో బాధ్యతను అప్పగిస్తున్నాను— నా డెడ్‌బాడీ నీ కప్పగించాలని వ్రాసి చనిపోతున్నాను. నీ కప్పగించిన నా డెడ్‌బాడీలో వుండే నా అన్నయ్య కిడ్నీ తీసి అతని దోసిట్లో పోయమని నిన్ను అర్థిస్తున్నాను. ఇది నా ఆఖరి కోర్కె. తీర్చవూ?

శర్మన్నయ్యా! నేను సజీవంగా వున్నప్పుడే ఆ కిడ్నీని నా శరీరంలోనుండి తొలగించి వెంకటన్న దోసిట్లో నేనే వుంచాలనే వెర్రి కోరికను ఏ డాక్టరూ ఆమోదించడని తెలిసి నా కోరికను సమాధి చేసుకుని చనిపోయాకయినా నా కోరిక, నా అన్నయ్యకు నేనున్న బాకీ తీరుస్తావని వ్రాస్తున్నాను.

శర్మన్నయ్యా! నా డెడ్ బాడీలోకూడా ఒక స్వార్థపరుడి కిడ్నీ వుండకూడదు. చనిపోయిన నాకెలాగూ ప్రాణం పోయలేవుగానీ నా కోరికకు ప్రాణం పోసి నా శరీరంలో నుండి ఆ కిడ్నీని వేరుచేసి అతనిదోసిట్లోపోసినన్ను ఋణ విముక్తురాల్ని చేస్తావని తలుస్తూ ఆనందంగా చనిపోతూ —నీకు కొండంత కృతజ్ఞతలతో, ప్రేమతో...

నీ చెల్లి
యమున.

సుదీర్ఘమైన ఆ ఉత్తరాన్ని చదివి డాక్టర్ దయానంద్ కూడా గుండెల నిండా భారాన్ని నింపుకున్నాడు.

''శర్మా! ఆత్మహత్యలనేవి ఆవేశంతో కూడినవి. ఆవేశం చల్లారిపోయాక యమున ఆ ప్రయత్నం నుండి మానుకుందేమో! అలాగే జరిగుంటే నీవెళ్ళి యమునతో తనకు పిల్లలు పుట్టొచ్చని తన జీవితం శేషారెడ్డితో సుఖమయం చేసుకోమని చెప్పి వాళ్ళిద్దరి వివాహం దగ్గరుండి జరిపించిరా.''

అప్పటివరకు నిస్తేజంగా కూర్చుని వున్న డాక్టర్ శర్మకు ఊహించలేని శక్తి వచ్చింది. అంతే —

శర్మ కూర్చున్న కారు చిత్తూరు వైపు వెళ్తోంది. ★